క్లుప్తంగా

సంయమనం పాటించండి

శ్రీకాళహస్తి: రంజాన్ మాసం, హోలీ- రెండు పండుగల నేపథ్యంలో శుక్రవారం అందరూ సంయమనం పాటించాలని డీఎస్పీ నరసింహ మూర్తి విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ మత సామరస్యంతో నడచుకోవాలని కోరారు.

సబ్ రిజిస్ట్రార్‌గా ఆనందరెడ్డి


ఆనందరెడ్డి

రేణిగుంట: రేణిగుంట సబ్ రిజిస్ట్రార్‌గా కోడేరు ఆనందరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మూడేళ్ల పాటు ఆయన ఇక్కడ పని చేశారు. ఆయనకు ఉద్యోగులు, డాక్యుమెంట్ రైటర్లు స్వాగతం పలికారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని ఆయన చెప్పారు.

ఆగమోక్తంగా మండలాభిషేకం


ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: హరిహర తీర్థంలోని శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీఅన్నపూర్ణేశ్వరి సమేత శ్రీహరహరేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఆగమోక్తంగా మండలాభిషేకం నిర్వహించారు. ఇటీవల ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తవడంతో మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఈ నేపథ్యంలో 41రోజులు పూర్తవడంతోస్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ లోకేష్‌రెడ్డి, ఉపముఖ్య అర్చకుడు దక్షిణామూర్తి, పురోహితులు అర్ధగిరి, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న దామోదర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: విభ ఇంగ్లిష్ పవర్ ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి జాతీయ సైన్స్ వారోత్సవాల్లో శ్రీకాళహస్తి విద్యార్థులు సత్తా చాటి ప్రశంసలు పొందారు. నచ్చిన శాస్త్రవేత్త అనే అంశంపై వ్యాసరచన పోటీల్లో పట్టణంలోని కుమారస్వామి తిప్ప పురపాలక సంఘ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన అబ్దుల్ ఘని రాష్ట్రస్థాయిలో మూడవ స్థానం, జిల్లాస్థాయిలో షేక్ హుస్నా మొదటిస్థానం సాధించారు. వీరిని గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి సన్మానించి అభినందించారు. మాట్లాడుతూ విద్యార్థులు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అన్సర్ హుస్సేన్, కరీముల్లా, సురేంద్రరెడ్డి, పక్రుద్దీన్, సలీం, జిలానీ, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పట్టవా?


పెండ్లిమండపం వద్ద నిబంధనలకు విరుద్ధంగా వెలసిన ఫ్లెక్సీ

శ్రీకాళహస్తి: పట్టణంలో కూటమి నేతలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. నాలుగు మాడ వీధుల్లో రాజకీయ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదనే నిబంధన ఉన్నా పట్టించుకోవడం లేదు. గతంలో బొజ్జల సుధీర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు వేశారని, మాడ వీధులు అపవిత్రం అవుతున్నాయంటూ నానాయాగీ చేశారు. పురపాలక కౌన్సిల్ తీర్మానం చేశామని, కాబట్టి దేవుళ్లు తిరిగే నాలుగు మాడ వీధుల్లో.. ఆలయం వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని నిబంధన పెట్టారు. కానీ ఇప్పుడు అవేవీ పట్టకుండా ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది.

ప్రయాణం నరకం..!


చెల్లూరు మార్గంలో రహదారి దుస్థితి

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం మునగలపాళెం-చెల్లూరు మార్గం పూర్తిగా గుంతలమయం కావడంతో ఈ మార్గంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు నడుమ వెళ్లాల్సి వస్తోంది. చెల్లూరు, కుక్కల గుంట, పాయల్ సెంటర్ గ్రామాలకు ఈ మార్గం మీదుగానే వెళ్లాలి. రహదారి వెంబడి పెద్ద, పెద్ద గుంతలు ఉండడంతో రాత్రి వేళల్లో ప్రధానంగా మోటార సైక్లిస్టులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ దారిలోనే చెల్లూరు పాఠశాల ముందు గుంతలు పడి మురుగునీరు నిండిపోవడంతో విద్యార్థులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు ఈ రహదారిని బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇష్టానుసారంగా ఆక్రమణలు


తారక రామానగర్‌లో వీధికి అడ్డంగా వేసిన అరుగు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీలోని తారక రామానగర్‌లో వీధి స్థలాలు కూడా ఆక్రమణల పాలవుతున్నాయి. వీధి స్థలంలో ఇళ్ల నిర్మాణాలు ముందుచొచ్చుకురావడంతో ఇబ్బందులు పడుతున్నారు. తారకరామానగర్‌లో నూతన భవనం నిర్మించి ముందు వీధిలో సుమారు ఒకటిన్నర అడుగు ఎత్తులో మట్టి తోలి అరుగు వేసుకోవడంతో ఆ వీధిలోకి ఎలాంటి వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా పోయిందని స్థానికులు చెప్పారు. ఇలాంటి నిర్మాణాలపై పంచాయతీ అధికారులు చర్యలు చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాజీవ్ నగర్‌ను పట్టించుకోండి


ప్రజలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణ శివారు ప్రాంతమైన రాజీవ్ నగర్ వాసులు మౌలిక వసతుల లేమితో సతమతమవుతున్నారని, ప్రభుత్వం దృష్టి సారించాలని సీపీఎం ఏరియా కార్యదర్శి గంధం మణి విజ్ఞప్తి చేశారు. రాజీవ్ నగర్‌లో గురువారం సీపీఎం ప్రజా చైతన్య యాత్ర ప్రారంభమైంది. స్థానికులు పలు సమస్యలను నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా తమ ప్రాంతంలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, వీధి దీపాలు సక్రమంగా ఏర్పాటు చేయలేదని వాపోయారు. ఇళ్లపైనే 33 కేవీ విద్యుత్ తీగలు వెళుతుండడంతో నిత్యం భయాందోళనల మధ్య గడుపుతున్నామని సమస్యలు ఏకరువు పెట్టారు. విద్యుత్ తీగలను రోడ్డు పక్క వెళ్లేలా మార్పు చేసేలా చూడాలని కోరారు. కనీసం తాగు నీటి సమస్య కూడా పరిష్కరించలేని స్థాయిలో పాలక ప్రభుత్వాలు ఉన్నాయని గంధం మణి మండిపడ్డారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, గెడి వేణు, కుమార్, మనోహర్, సి.గురవయ్య, రంగస్వామి, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నాణ్యమైన తాగునీరు ఇవ్వాలి


సత్యవేడు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు మోటారు గదిని పరిశీలిస్తున్న సీఈఓ రవికుమార్ నాయుడు

సత్యవేడు: సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి 13 గ్రామాలకు సరఫరా చేస్తున్న తాగునీరు నాణ్యతగా క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలని సీఈఓ రవికుమార్ నాయుడు కోరారు. గురువారం సీఈఓ తెలుగుగంగ కాలువ సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. సంపు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో 15వ ఆర్థిక సంఘం నిధులు, మండల గ్రాంటు, పోస్టింగ్ రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్, అటెండెన్సు రికార్డులను పరిశీలించారు. తరువాత నూతనంగా ఆధునీకరించిన పీఆర్ గెస్టు హౌస్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, జడ్పీటీసీ పి.విజయలక్ష్మీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శైలజకుమారి, ఏఈ దేవిక, వైఎస్‌ఆర్ సీపీ జిల్లా నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ తరుణాక్ష రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ ఇబ్రహీంఖాన్, వాసు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బొజ్జలా..! ఇటు చూడవేల..?



టీడీపీ కార్యాలయం ముందు వేసిన తారు రోడ్డు, ప్రభుత్వాస్పత్రి వద్ద గుంతల రోడ్డు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండు వెనుక ప్రభుత్వాస్పత్రి రోడ్డు మొత్తం గుంతలమయమై రాకపోకలకు ప్రజలు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి అంతర్గత రోడ్లు కూడా దెబ్బతిని ఉండడంతో అవస్థలు తప్పడం లేదు. అవే రోడ్లలో ఉన్న టీడీపీ కార్యాలయ ద్వారం వరకు తారురోడ్డు వేసుకున్నారేగానీ ప్రజల కోసం కూటమి నాయకులు ఆలోచించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వాస్పత్రికి వెళ్లే రోడ్డును పూర్తిగా బాగు చేయడంతోపాటు ఆస్పత్రి అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జీవ వైవిధ్య సంరక్షణకు అడుగులు


మాట్లాడుతున్న ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలయపాలెం విజయకుమార్

తిరుపతి మంగళం : రాష్ట్ర అటవీ పరిధిలోని అరుదైన జీవ, వృక్ష జాతులను కాపాడుకుంటూ, మనిషి మనుగడ సాగించే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలయపాలెం విజయకుమార్ వెల్లడించారు. తిరుపతి నగరంలోని ఓ హోటల్లో గురువారం ఆయన బోర్డు మెంబర్ సెక్రటరీ రామకృష్ణతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో జీవ వైవిధ్య మండలి లక్ష్యాలు నీరుగారిపోయాయన్నారు. ఇందులో భాగంగానే రాజధాని అమరావతి, వైజాగ్, తిరుపతిలో బయోడైవర్సిటీ పార్కులు ఏర్పాటు చేయనున్నట్టు స్పష్టం చేశారు. తిరుపతిలో 110 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసేందుకు టీటీడీ యాజమాన్యం, జిల్లా కలెక్టర్‌తో చర్చించినట్లు చెప్పారు. వచ్చే రెండు, మూడేళ్లలో 13 ఉమ్మడి జిల్లాల పరిధిలోనూ బయోడైవర్సిటీ పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. తిరుపతి జిల్లా పరిధిలోని తలకోన, తిరుపతిలోని కపిలతీర్థం ఏరియాను బయోడైవర్సిటీ హెరిటేజ్ ప్రదేశాలుగా ప్రకటించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టామన్నారు. తిరుమల పరిధిలోని జాపాలితీర్థం, పుత్తూరు పరిధిలోని కైలాసకోనను బయోడైవర్సిటీ పవిత్ర ప్రదేశాలుగా ప్రభుత్వం ప్రకటించబోతోందన్నారు. తిరుపతి కేంద్రంగా నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు నేతృత్వంలో నగరంలోని మానస సరోవర్ హోటల్ వేదికగా శుక్ర, శనివారాల్లో రెండు రోజులపాటు నిపుణుల కమిటీ(ఎక్స్‌పర్ట్ కమిటీ) సమావేశం జరగనుందని తెలిపారు.

ప్రకృతి అందాల పొదరిల్లు మామండూరు


మామండూరు లోని సరస్సును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్


ఫొటో గ్యాలరీని పరిశీలిస్తున్న కలెక్టర్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): అరుదైన ప్రకృతి అందాల పొదరిల్లు శేషాచల అడవి మామండూరు సొంతమని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ కొనియాడారు. తిరుపతి జిల్లా లెవెల్ ఫారెస్ట్, వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశాన్ని గురువారం రేణిగుంట మండల పర్యాటక కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఏకో టూరిజం ఆధ్వర్యంలో పర్యాటక కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేషాచలం బయోస్ఫియర్ రిజర్వులోని శ్యామల వ్యాలీలోని మామండూరు కమ్యూనిటీ ఆధారిత టూరిజంను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇక్కడ 100 సంవత్సరాల క్రితమే అటవీ శాఖ భవనాలు ఉన్నాయని, దట్టమైన ఈ అడవులలో సుమారు 80 కి పైగా చిరుతపులులు, ఏనుగుల విహారం , 40 పక్షి జాతులు ఉన్నాయన్నారు. పర్యాటక పాంత్రాన్ని మరింత అభివృద్ధి చేసి కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజంగా తీర్చిదిద్దుతామన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, ఐఎఫ్ఎస్ సెల్వం, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, రేణిగుంట తహసీల్దార్ సురేష్ బాబు, డీఎస్పీ శ్రీనివాసరావు, డీఆర్‌ఓ గౌస్ కరీమ్, పర్యటక కేంద్రం చైర్మన్ కుమారస్వామి పాల్గొన్నారు.

ఇంటి పట్టాల కోసం రిలే దీక్షలు


రిలే నిరాహార దీక్షలు చేస్తున్న దళితులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామ దళితులు ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ గురువారం రెండవ రోజు తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వారు మాట్లాడుతూ కనమనంబేడు గ్రామ రెవెన్యూలోని 252, 253, 254 సర్వే నెంబర్‌లలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాల కోసం స్వాధీనం చేసుకున్నామని, స్వాధీనం చేసుకున్న భూమికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి పట్టాలు ఇచ్చే వరకు రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ధర్మయ్య, గ్రామస్తులు రమణయ్య, సుబ్రమణ్యం, వీరాస్వామి, మణి, గుర్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యోగా మాస్టర్‌కు జీవిత సాఫల్య పురస్కారం



సుజాతను సన్మానిస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన యోగా మాస్టర్ అయిలం సుజాత జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. బెంగళూరులో గురువారం వివేకానంద ఇంటర్నేషనల్ ప్రగతి యోగా కల్చరల్ అకాడమి, అజంతా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమి సంయుక్తంగా నిర్వహించిన గ్లోబల్ భారత్ టాలెంట్ సమ్మిట్‌లో సుజాతకు అఖిల భారత జీవిత కాల సాధన అవార్డును ప్రదానం చేశారు. దేశవ్యాప్తంగా పదేళ్ల పైబడి యోగాలో సేవలందించిన మాస్టర్లను ఈ అవార్డుతో సత్కరించారని సుజాత చెప్పారు.

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీని కొనసాగించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

పుత్తూరు: రాష్ట్రంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని కొనసాగించాలని స్థానిక అధ్యయన కేంద్రం అధ్యాపకులు, బోధనేతర ఉద్యోగులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర విభజన సందర్భంగా అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని పదేళ్ల పాటు కొనసాగించుకోవచ్చునన్న నిబంధన మేరకు కొనసాగుతూ వచ్చిందని తెలిపారు. ఇటీవల పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లను నిలిపివేశారని తెలిపారు. అడ్మిషన్లు లేకపోతే విద్యార్థులు విలువైన కాలాన్ని కోల్పోతారన్నారు. వెంటనే డిగ్రీ, పీజీ, డిప్లొమా అడ్మిషన్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. యూజీసీ సూచన మేరకు మన రాష్ట్రంలోనూ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపల్ జి.కోటేశ్వరయ్య, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ టి.నరసింహులు, పి.కుప్పానాయుడు, ఎం.మునిరత్నం, పి.సుబ్రమణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతన వెతలు


కూల్ కింగ్ పరిశ్రమ వద్ద గుడికూడిన కార్మికులు

- నిరసనకు దిగిన పరిశ్రమ కార్మికులు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు ఏపీఐఐసీ సెజ్‌లోని ఏసీ విడిభాగాలు తయారు చేసే కూల్ కింగ్ పరిశ్రమలో కార్మికులకు గత కొద్ది రోజులుగా వేతనాలు అందక ఇబ్బందిపడుతున్నారు. ఏడాది కాలంగా సకాలంలో జీతాలు చెల్లించక అరకొర చెల్లింపులతో కార్మికులను ఇబ్బందిపెడుతున్నట్లు వారు వాపోయారు. దీంతో గురువారం పరిశ్రమలో పనిచేసే కార్మికులు మూకుమ్మడిగా నిరసన వ్యక్తం చేశారు. జీతం మీద ఆధారపడి పరిశ్రమకు వెళ్తుంటే సకాలంలో జీతాలు చెల్లించకపోవడమేమిటని ప్రశ్నించారు. పరిశ్రమ ఏర్పాటు నుండి పరిశ్రమ యాజమాన్యం జీతాలు చెల్లింపుల్లో నిర్లక్ష్యం చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమలో కార్మికులను కాంట్రాక్ట్ పద్ధతిలో నిర్వహించే ఏజెన్సీలకు నెలనెలా బిల్లులు చెల్లించని కారణంగా ఏజెన్సీ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొందని సమాచారం. ఇదే పరిస్థితి కొనసాగితే సామూహికంగా రోజువారీ పరిశ్రమ వద్ద నిరసన వ్యక్తం చేస్తామని కార్మికులు హెచ్చరించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ

ఇక మహిళా ర్యాపిడోస్

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో ఇకపై మహిళా ర్యాపిడోలు హల్‌చల్ చేయనున్నారని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘంలోని 25 మంది సభ్యులకు గురువారం స్థానిక మెప్మా కార్యాలయం వద్ద ర్యాపిడో ఈ-బైక్‌లను అందజేశారు.



విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న మునీర్‌బాషా, రేణిగుంట బాలికల హైస్కూల్లో..

శ్రీకాళహస్తి: పట్టణంలో రాజీవ్‌నగర్‌లోని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రతిభ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపకులు మునీర్‌బాషా పరీక్ష సామగ్రిని వితరణ చేశారు. ఈ సంవత్సరం పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్తేర్ రాణి, సంస్థ సభ్యులు మల్లీశ్వరి, బాబా ఫరీద్, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి బాలికలకు గురువారం ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ పరీక్ష సామగ్రిని సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్దాల రవిబాబు పంపిణీ చేశారు. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించి స్కూలుకు పేరు తేవాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం విష్ణువర్ధిని, సంస్థ ఈసీ మెంబర్ డాక్టర్ కోదండరామిరెడ్డి, ఉపాధ్యాయులు శైలజ, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రి అందజేస్తున్న జైభీమ్ సభ్యులు, ఆల్ ది బెస్ట్ కిట్లు పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

నాగలాపురంలో..

నాగలాపురం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం జైభీమ్ ఫౌండేషన్ సంస్థ వారు పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్ చేతులమీదుగా విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఎంఈఓ జనార్దనరాజు, రిటైర్డ్ టీచర్ గుర్రప్ప, మహేంద్రన్, పరంధామన్, రమేష్ బాబు, చిరంజీవి, నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ కిట్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు 2004–05 బ్యాచ్ పూర్వ విద్యార్థులు గురువారం ఆల్ ది బెస్ట్ కిట్లు పంపిణీ చేశారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి, మంచి మార్కులు సాధించాలని, స్కూలుకు, గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.